

లెంకాలపల్లి సమీపంలో ధ్వంసమైన ఎస్సారెస్పీ 17ఎల్ ఉపకాల్వను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ డీఈ రవి, ఏఈ పవిత్ర

## ఎస్సారెస్పీ సబ్ కెనాల్ ధ్వంసంపై విచారణ

**పరిశీలించిన ఇరిగేషన్ శాఖ అధికారులు**

**బాధ్యులపై పోలీసులకు ఫిర్యాదు**

నల్లబెల్లి, ఏప్రిల్ 15 : నల్లబెల్లి మండలం లెంకాలపల్లి శివారు కుమ్మరిమడుగు సమీపంలో ఎస్సారెస్పీ సబ్ కెనాల్ సీసీ, కల్వర్టును ధ్వంసం చేసిన ఘటనపై అధికారులు స్పందించారు. 'ఎస్సారెస్పీ ఉపకాల్వలు కబ్జా' శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 14న కథనం ప్రచురితమైంది. ఈమేరకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య స్పందించి విచారణకు ఆదేశించారు. దీంతో ఇరిగేషన్‌శాఖ డీఈ సంగాల రవి, ఏఈ పవిత్ర సోమవారం పరిశీలించారు. ఆయకట్టు రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ 17ఎల్ ఉపకాల్వ ధ్వంసం చేసి న రైతు పేరం రాజయ్య, అతడి కుమారుడు పేరం పెద్ద రాజుతోపాటు ఉపయోగించిన జేసీబీ యంత్రం వివరాలతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు డీఈ వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా, ఆక్రమించినా ఉపేక్షించేది లేదని, బాధ్యులు ఏడేళ్ల జైలు శిక్షకు అర్హులవుతారని హెచ్చరించారు.

## ఉద్యోగం రాలేదని..

**ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య**

హసన్‌పర్తి, ఏప్రిల్ 15: కానిస్టేబుల్ ఉద్యోగం రాలేదని మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అర్వపల్లిలో సోమవారం జరిగింది. సీఐ సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హసన్‌పర్తి మండలం అర్వపల్లికి చెందిన ఆకుల రంజిత్ (30) 2022 సంవత్సరం, ఆ తర్వాత మూడు సార్లు కానిస్టేబుల్, ఎస్సై పోస్టులకు అప్లై చేసినప్పటికీ ఎందులోనూ సెలెక్ట్ కాలేదు. దీంతో ఉద్యోగం రాలేదని నాలుగు నెలలుగా రందితో ఉంటున్నాడు. సోమవారం ఉదయం 10 గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో లుంగీతో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇవ్వగా చేరుకున్న సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


రంజిత్ (ఫైల్)

## నన్నే కాటేస్తావా?

**పామును చంపి.. బాటిల్‌లో దవాఖానకు తీసుకొచ్చిన మహిళ**

**చికిత్స పొందుతున్న ఉపాధి హామీ కూలీ**

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్15 : పాముకాటుకు గురైన మహిళ చికిత్స కోసం పామును చంపి ప్రభుత్వ దవాఖానకు తీసుకొచ్చింది. ఈ ఘటన వెంకటాపురం(నూగూరు) మండలం ముకునూరుపాలెంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన మిడియం శాంతమ్మ గ్రామ సమీపంలో ఉపాధి హామీ పనులకు వెళ్లింది. పనులు చేస్తున్న క్రమంలో పాము కాటు వేసింది. దీంతో ఆమె దానిని చంపి వాటర్ బాటిల్‌లో వేసి మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తోటి కూలీలతో కలిసి వచ్చింది. వైద్యులకు పామును చూపించి వైద్యం అందించాలని కోరింది. వైద్యులు చికిత్స అందించగా ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. కాగా, శాంతమ్మ పామును చంపి దవాఖానకు వెంట తీసుకురావడంతో గ్రామస్తులు, వైద్యులు, సిబ్బంది నివ్వెరపోయారు.


దవాఖానలో చికిత్స పొందుతున్న శాంతమ్మ

### సీఎం చెప్పినా.. జరగని కొనుగోళ్లు..

'రైతు పండించిన ప్రతి గింజనూ మద్దతు ధరకే కొంటాం.. ధర తగ్గించే వారిపై కఠిన చర్యలు ఉంటాయ్'..ఇది 'నమస్తే తెలంగాణ' రెండు రోజులుగా వరుస కథనాలు ప్రచురించిన తర్వాత అధికారుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన. కానీ వరుసగా ఐదోరోజూ సోమవారం జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం, మక్కల కొనుగోళ్లలో ప్రతిష్టంభన కొనసాగుతున్నది. సీఎం చెప్పినా.. మార్కెటింగ్, రెవెన్యూ, సహకార, పౌర సరఫరాల వంటి దాదాపు 50మంది జిల్లా అధికార యంత్రాంగం పర్యవేక్షిస్తున్నా ధాన్యం, మక్కల కొనుగోళ్లలో అడుగు ముందుకు పడలేదు. దీంతో రైతులు, మహిళా రైతులు పిల్లాపాపలతో సద్దులు కట్టకొని వచ్చి యార్డులో పడిగాపులు కాస్తున్నారు.






జనగామ మార్కెట్‌లో ఐదు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు లేక రాశులపై పడిగాపులు కాస్తున్న మహిళలు, వృద్ధ రైతులు

# కొనరు.. వినరు..

## సీఎం ఆదేశించినా కొనుగోళ్లకు ముందుకురాని ట్రేడర్లు

**జనగామ మార్కెట్‌లో రైతుల పడిగాపులు.. ఐదు రోజులైనా అదే తీరు..**

అమ్మకానికి 40వేల బస్తాల ధాన్యం.. మద్దతు ధరకు కొన్నది రెండు వేల బస్తాలే

**రంగుమారుతున్న ధాన్యం.. పేరుకుపోయిన మక్కజొన్న నిల్వలు**

**మార్కెట్ కార్యాలయం వద్ద గడ్డి కాల్చి రైతుల నిరసన**

జనగామ, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : ఆరుగాలం శ్రమించి పండించిన పంటలను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు అరిగోస పడుతున్నారు. పండిన ప్రతి గింజకూ మద్దతు ధర అందిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నమ్మిన రైతుకు భంగపాటే మిగిలింది. జనగామ వ్యవసాయ మార్కెట్‌లో కొనేవాళ్లు లేక ఐదు రోజులుగా ధాన్యం, మక్కజొన్న రాశుల వద్ద రోజూ పిల్లా, పాపలతో సద్దులు కట్టుకొని వచ్చి పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలన తీరుకు ఇది అద్దం పడుతున్నది. జనగామ మార్కెట్‌లో పంటల ఉత్పత్తుల కొనుగోళ్లపై ప్రతిష్టంభన కొనసాగుతూనే ఉంది. ఈనెల 10న మార్కెట్‌లో జరిగిన ఆందోళన నేపథ్యంలో ట్రేడర్లు కొనుగోళ్లకు దూరంగా ఉన్నారు. తమపై పెట్టిన చీటింగ్ కేసులను ఎత్తివేసి హామీల సమస్యను పరిష్కరించే వరకూ కొనుగోళ్లు జరుపబోమని భీష్మించారు. ధాన్యంతో పాటు మక్కలు, చింతపండు లాంటి ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లను సైతం ట్రేడర్లు నిలిపివేశారు. ఎంఎస్‌పీకే కొనాలని, లేకుంటే చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేస్తుంటే.. లేదులేదు తేమ, తాలు శాతాన్ని పరిగణలోకి తీసుకొని ధర నిర్ణయిస్తామంటూ తెగేసి చెబుతున్నారు. దీంతో మార్కెట్‌లో ఐదురోజులుగా ధాన్యం, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లలో ప్రతిష్టంభన కొనసాగుతుండడంతో ఏం చేయాలో తెలియక అధికారులు తల పట్టుకుంటున్నారు. ఈనెల 11 నుంచి ఆదివారం వరకు జనగామ మార్కెట్‌కు నాలుగు రోజుల పాటు వరుసగా సెలవులు వచ్చాయి. సోమవారం మార్కెట్‌లో కొనుగోళ్లు జరగాల్సి ఉన్నా ట్రేడర్లు ముందుకు రాకపోవడంతో నిలిచిపోయాయి.

### 40వేల బస్తాల్లో.. కొన్నది రెండు వేలే..

ఇప్పటికే అమ్మకానికి తెచ్చిన దాదాపు 40 వేలకు పైగా ధాన్యం బస్తాలు మార్కెట్‌లో పేరుకుపోయాయి. సహకార సంఘం, ఐకేపీ, సివిల్ సప్లై వంటి మూడు ప్రభుత్వరంగ కొనుగోలు కేంద్రాలను మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసినా వాటి ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు రెండు వేలే. పాత నిల్వలు ఉండగానే ధాన్యం, మక్కలను రైతులు యార్డుకు తెస్తుండడంతో యార్డులో భారీగా పేరుకుపోతున్నాయి. స్వయంగా ముఖ్యమంత్రి స్థాయిలో జోక్యం చేసుకున్నా..మాయిశ్చర్ (తేమ), తాలు, మట్టి సాకుతో జనగామ మార్కెట్‌లో ప్రభుత్వరంగ సంస్థలు కొన్నది నామమాత్రమే. సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కొనుగోళ్ల కోసం ఎదురుచూసిన రైతులు కడుపుమండి ఆందోళనకు దిగారు. పలుమార్లు మార్కెట్ కార్యాలయంలోకి వెళ్లి మార్కెటింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజూనాయక్, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, ఆర్డీవో కొమురయ్య, కార్యదర్శి శ్రీనివాస్‌ను నిలదీశారు. అయితే అధికారులు మాత్రం నిబంధనల ప్రకారం తేమ, తాలు లేకుండా ఉన్న ధాన్యానికి మాత్రమే మద్దతు ధర దక్కుతుందని, లేకుంటే రైతులు ఆరబెట్టుకునే వరకు కొనం అని స్పష్టం చేశారు.


మార్కెట్ కార్యాలయం బయట ఆందోళన చేస్తున్న రైతులు



### గడ్డి కాల్చి రైతుల ఆందోళన..

మా ధాన్యం మక్కిబూజు పడుతున్నది.. ప్రైవేట్ ట్రేడర్లకు అమ్మేందుకు మేం సిద్ధం అని రైతులు స్పష్టం చేసినా.. యార్డులో మద్దతు ధరకు మాత్రమే కొనాలని పై నుంచి ఆదేశం.. బయటకు వెళ్లి మీరు ఎంతకైనా అమ్ముకోండి..అంటూ అధికారులు నర్మగర్భంగా బయటకు వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్న తీరుపై రైతులు మండిపడుతున్నారు. ప్రభుత్వం మద్దతు చెల్లించి కొనదు.. మమ్మల్ని ప్రైవేట్‌కు అమ్ముకోనివ్వదు.. మేం ఎన్నిరోజులు మార్కెట్‌లో పస్తులతో పడిగాపులుండాలి..? అని ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు సోమవారం మార్కెట్ కార్యాలయంలోకి వెళ్లి తాళాలు వేసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కార్యాలయం ముందు ఎండుగడ్డి, చెత్తను పోగేసి మంటపెట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ వచ్చి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### కేసీఆర్ పాలనలోనే బాగుండే..



మద్దతు ధర ఇస్తమంటే మార్కెట్‌కు వడ్లు తెచ్చిన.. పచ్చిగున్నయ్ అంటే ఐదు రోజుల నుంచి ఎండబెడుతున్న అయినా కొంటలేరు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతుకు ఇంత అన్యాయం జరగలేదు. వడ్లు కొనేది..రైతుబంధు వెంటనే పడేది.. పింఛన్లు వచ్చేవి..ఇప్పుడు ఏదీ లేదు..రేవంత్‌రెడ్డి రైతు భరోసా పెంచుత అన్నడు..ఆడోళ్లకు రూ. 2500 అన్నడు..పింఛన్లు పంచుతా అన్నడు..కరువు పైసలు మూడునెలల నుంచి రూపాయి రాలేదు. గత ప్రభుత్వంలో వారంకోసారి డబ్బులు పడేది. ఉప్పులు, పప్పులు తెచ్చుకొని..ఇంట్లో ఎల్లదీసుకొని చిట్టీలు కట్టుకునేది. వడ్లు కొంటలేడు..ఇంక బోనసా..? వాని ముఖం ఇస్తడు. చెరువులకు నీళ్లు వస్తలేవు..నీళ్లు రానిది పొలాలు ఎట్లా పండుతాయ్..జైలుకైనా పోతం కాని ఈ కష్టం భరించలేం..మళ్లీ కేసీఆర్‌కే ఓటేస్తాం.. – పేరం రేణుక, రైతు, చీటకోడూరు


మంటలతో దట్టంగా ఆవరించిన పొగలు

## కేటీకే ఓసీ-3లో మంటలు

**ఎండవేడికి అంటుకున్న బొగ్గు నిల్వలు**

**కొండంపల్లి గ్రామాన్ని ఆవరించిన పొగ**

గణపురం, ఏప్రిల్ 15 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం ధర్మారావుపేట శివారులోని కేటీకే ఓసీ-3లోని బొగ్గు నిల్వలకు మంటలు అంటుకున్నాయి. దీంతో దట్టమైన పొగ కొండంపల్లి గ్రామాన్ని చుట్టుముట్టడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఓసీ-3 కోసం భూసేకరణలో భాగంగా కొండంపల్లి గ్రామా న్ని తరలిస్తామంటూ పలుమార్లు గ్రామసభలు నిర్వహించి పరిహారాన్ని నిర్ణయించారు. మొదట్లో సింగరేణి యాజమాన్యం వ్యవసాయ భూములను తీసుకోవడంతో పాటు కొండంపల్లి గ్రామాన్ని తరలించి పునరావాస ప్యాకేజీ అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఏళ్లు గడుస్తున్నా గ్రామాన్ని తరలించలేదు. ఈ క్రమంలో వేసవి కాలం ఎండ తీవ్రతకు ఓసీలో నిల్వ ఉన్న బొగ్గు అంటుకున్నది. దీంతో మంటలు చెలరేగి దట్టమైన పొగ గ్రామాన్ని కమ్మేయడంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురై సింగరేణి అధికారులకు సమాచారమందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం తమ గ్రామాన్ని తరలించి రక్షించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

## భూ కబ్జాదారులపై సీపీ నజర్

**పోలీస్ స్టేషన్ల వారీగా వివరాల సేకరణ**

సుబేదారి, ఏప్రిల్ 15 : వరంగల్ నగరంలోని భూ ఆక్రమణలపై సీపీ అంబర్‌కిశోర్ ఝూ నజర్ పెట్టారు. మట్టెవాడ, మిల్స్‌కాలనీ, ఇంతెజార్‌గంజ్, సుబేదారి, కేయూసీ, హనుమకొండ, కాజీపేట, నగర శివారు ప్రాంతాలు ధర్మసాగర్, హసన్‌పర్తి, దామెర, గీసుగొండ, మామూనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన భూ ఆక్రమణ కేసులు, కబ్జాదారుల చిట్టాను అధికారుల నుంచి సోమవారం తెప్పించుకున్నట్లు సమాచారం. కొద్దినెలల నుంచి కేయూసీ, సుబేదారి, హసన్‌పర్తి, ధర్మసాగర్, దామెర, మిల్స్‌కాలనీ, మామునూరు పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో పాటు న్యాయం కోసం బాధితులు సీపీకి మొర పెట్టుకుంటున్నారు. ఈమేరకు ఆక్రమణలపై సీపీ ప్రత్యేక దృష్టితో స్టేషన్ల వారీగా ఆరా తీస్తున్నారు.

## భద్రకాళీకి లక్ష పుష్పార్చన


వరంగల్, ఏప్రిల్ 15 : భద్రకాళీ దేవస్థానంలో వసంతోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారికి లక్ష లిల్లీలతో పుష్పార్చన చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి తెలిపారు. అనంతరం లలిత సహస్ర నామ పారాయణం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.


కేటీఆర్‌ను కలిసిన వరంగల్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నేతలు

## కేటీఆర్‌ను కలిసిన వరంగల్ నేతలు

హనుమకొండ, ఏప్రిల్ 15 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఉమ్మడి జిల్లా నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో వరంగల్ లోక్‌సభ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వరంగల్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని ఈ సందర్భంగా కేటీఆర్ వారికి సూచించారు. మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య ఉన్నారు.

## చదువుకోవాలని మందలించడంతో ఆత్మహత్య

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన బలిజ నిఖిల్ (21) తండ్రి మందలించాడని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. నిఖిల్ హనుమకొండలోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. పరీక్షలు ఉన్నాయని చదువుకోవాలని తండ్రి రవీందర్ మందలించడంతో పురుగుల మందు తాగాడు. దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.


మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు

# ఎరుపెక్కిన ఎనుమాముల

**ఎర్రబంగారంతో నిండిన మార్కెట్**

**లక్షా 50వేలకు పైగా బస్తాల రాక**

**ధర తగ్గడంతో రైతుల్లో నిరాశ**

**కోల్డ్ స్టోరేజీల్లో ఖాళీ లేక దిగాలు**

కాశీబుగ్గ, ఏప్రిల్ 15 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం ఎర్రబంగారం పోటెత్తింది. వరుసగా పది రోజుల పాటు ఉగాది, రంజాన్ పండుగల సెలవుల తర్వాత సోమవారం మార్కెట్‌కు లక్షా 50వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. దీంతో మార్కెట్‌లో ఎటుచూసినా మిర్చి బస్తాలతో నిండిపోయింది.

ఆయా రాష్ట్రాల్లో ధరలు తక్కువగా ఉండడంతో పక్కనున్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా రైతులు మిర్చి బస్తాలను అమ్ముకునేందుకు తీసుకొస్తున్నారు. మిర్చి రాక పెరగడంతో అడ్తి, ఖరీదు వ్యాపారులతో పాటు దడువాయి, గుమస్తా, హమాలీ, ఇతర కార్మికవర్గాలు చేతి నిండా పని దొరుకుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నాయి. అయితే ధరలు లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మార్కెట్‌కు డిసెంబర్ నుంచి కొత్త మిర్చి రావడం ప్రారంభమైంది. సీజన్ ప్రారంభంలో 2వేల నుంచి 10వేల బస్తాల రాగా సంక్రాంతి తర్వాత పెద్ద సంఖ్యలో రావడం మొదలైంది. ఫిబ్రవరి 19న, మార్చి 14న లక్షకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. అప్పటినుంచి రోజూ అత్యధికంగా 50వేల నుంచి 80వేల బస్తాలకు పైగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు మార్కెట్‌కు 9లక్షల క్వింటాళ్లకు పైగా మిర్చి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. అందులో ధరలు క్వింటాల్‌కు తేజా రకం గరిష్ఠంగా రూ.18వేల 300, కనిష్ఠంగా రూ.14వేల 500, వండర్‌హాట్ గరిష్ఠంగా రూ.15వేలు, కనిష్ఠంగా రూ.11వేలు, యూఎస్ 341 రకం గరిష్ఠంగా రూ.15వేల 500, కనిష్ఠంగా 11వేలు, దేశీ రకం గరిష్ఠంగా రూ.27వేలు, కనిష్ఠంగా రూ.20వేలు, సింగిల్ పట్టి గరిష్ఠంగా రూ.30వేలు, కనిష్ఠంగా రూ.23వేలు, తాలు రకం మిర్చి రూ.7వేలు, కనిష్ఠంగా రూ.3వేలు పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. అటు గిట్టుబాటు ధర లభించక ఇటు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు ఖాళీ లేక రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఈ క్రమంలో కొందరు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు.

